
# మా చిన్నత్త...

చల్లపల్లి స్వరూపరాణి



**మా చిన్నత్త తిరుపతమ్మంటే మా యింట్లో అందరికీ హడల్. మా అమ్మనీ, మా పిల్లలందరినీ హడలెత్తించే మా నాన్నకు కూడా మా అత్తంటే భయం. నాన్న ఆమె గురించి అందరికీ "నా పిల్లలు, నేను పచ్చగా వున్నామంటే మా అప్ప చలవే" అని గొప్పగా చెప్పుకుంటాడు.**

యిక మా అమ్మకు సరేసరి. అమ్మ పుట్టింటోళ్ళు కూడా మా నాన్నకంటే, నాయనమ్మ, తాతలకంటే కూడా చిన్నత్తంటేనే జాగ్రత్తగా మసలుకుంటారు. మా పిల్లలకు మాత్రం ఆమె దగ్గర కొంచెం చనువెక్కువ. అమ్మానాన్న ఏదీ పట్టనట్టు వున్నా అత్తమాత్రం మమ్మల్ని కనురెప్పల్లా కాపాడింది. మాకు ఏ చిన్న యిబ్బంది కలిగినా ఆమె ప్రాణం విలవిలలాడి పోతుంది. నాన్నంటే ఆమెకు చెప్పలేనంత, కొలవలేనంత మమకారం. ఆమెకు పిల్లలున్నా వాళ్ళని నాన్నకంటే ఎక్కువగా చూసుకునేది కాదేమోననిపిస్తుంది.

చిన్నత్త మా నలుగురత్తలలో ఆఖరుది నాన్నకంటే పెద్దది. అందుకని ఆమెని చిన్నత్త అంటాం. ఆమె మా అత్తయ్యలు ముగ్గురికంటే అందమైందీ, తెలివికలదీ కూడా! అయినా ఏంసుకం ఆమెకి చిన్న వయసప్పుడే భర్త చనిపోవడంతో అప్పటి నుంచి మమ్మల్ని కనిపెట్టుకుని వుంటుంది. మా అత్త మంచి పనికత్తె. పనికి వొంగితే మగాళ్ళు కూడా ఆమెకన్నా వెనకబడిపోవల్సిందే! ఆమెకు యిది ఆడపనీ, యిది మగపనీ అనే తేడాలేదు. మనిషి పుట్టుక పుట్టిందే పని చేయడానికన్నట్టు వుంటుంది. ఆమె ఎంత లావు బరువులైనా సులభంగా ఎత్తుకుని వస్తుంది. రాత్రనక పగలనక ఓ[illegible] వెంట, డొంకల వెంట నిర్భయ[illegible] నడిచి వెళ్తుంది. రాత్రిపూట వరిచేనుకు నీళ్ళుపెట్టాలంటే అత్త నాలుగామళ్ళ దూరం లాంతరు పట్టుకుని చకచకా నడిచివెళ్ళి చేను తడిచేదాకా అక్కడే వుండి పంటకాలువ గండి కట్టేసివచ్చేది. మా స్కూళ్ళ రోజుల్లో వడ్లు యింటికి చేరేదాకా మా పిల్లల్లో ఎవరో ఒకర్ని నామకార్థంగా వెంట తీసుకెళ్ళి కాపలా పడుకునేది. నాన్న మాత్రం చలికి వెచ్చగా ముసుగుతన్ని యింట్లో పడుకునేవాడు. మా నాలుగెకరాల పొలం చిన్నత్త నెత్తురు చుక్కలతో తడిపి సాగుచేయబట్టే మాకు తిండిగింజలకు కొదవలేకుండా గడిచిపోతుంది. ఆ సంగతి పైకి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మా యింట్లో అందరికీ ఎరుకే!

చిన్నత్త తిరుపతమ్మంటే వూళ్ళో వాళ్ళందరికీ 'గయ్యాళిగంప' అని గుర్తింపు. ఆమె నోరంటే యింట్లో వాళ్ళు, బయటివాళ్ళు జాగ్రత్తగా వుంటారు. ఆమె మాటకారితనం ముందు ఎంత లావు వాళ్ళయినా నోరు వెళ్ళబెట్టాల్సిందే! ఆమె చదువుకుని వుంటే యింకెంత తెలివిగా వుండేదో కదా అని అందరూ అనుకుంటారు. చిన్నత్త నోరెత్తితే చాలు "ఆడదైనా మొగోడైనా పనిచేసి మరవాలిరా... పని ముద్దా... భాగ్యం ముద్దా... ఆడదానికైనా మొగోడికైనా ఒక నీతి వుండాలి. నీతి లేకపోతే ఎందుకీ మానవజన్మ" అని యాష్టపోయేది. చిన్నప్పుడు యివన్నీ అర్థమయ్యేవికావు. పనిమాట కొస్తే పాపం ఆమె ఆరుగాలం పనిచేసే కష్టజీవి కాబట్టి నాన్నలాంటి సోమర్లకు ఆ మాత్రం చురకలు వెయ్యాల్సిందే! మరి యీ నీతి మాటేంటబ్బా... బుర్ర చించుకున్నా అర్థమయ్యేదికాదు.

అన్నయ్యలు ఒక్కొక్కరే ఎదిగి పెళ్ళిళ్ళు చేసుకుని వేరే కాపురాలు పెట్టుకుంటున్నారు. నాన్న రాజకీయాలు నాన్నవి. అమ్మకి పాపం ఏమీ పట్టవు. యింటిపనీ, వంటపనీ సరిపోతుంది. అత్త పొలంలో వుంటే క్యారియర్‌లో అన్నం పెట్టుకుని పడుతూ లేస్తూ ఆమెకి వేళకి అన్నం యిచ్చి వస్తుంది. అ[illegible]మాత్రం వయసు పైబడుతున్నా తొణకకుండా బెణకకుండా నడుం కట్టుకుని మగరాయుడులాగా పనులు చేస్తూ వుంది. ఆమెను చూస్తే మా దొడ్లో నేను చిన్నప్పటి నుండీ చూస్తున్న పొడిచే పుల్లెద్దు గుర్తుకొస్తుంది. మా పుల్లెద్దుకి ఓపిక వున్నా లేకపోయినా రోషం జాస్తి. అది గుడ్లురిమి చూసిందంటే అక్కడున్న గొడ్లన్ని బెదిరి తోక ముడుచుకుంటాయి. దానిది అదో రకం రాజసం మా అత్తలాగే!

ఈమధ్య అందరూ ఎవరి కుంపట్లు వాళ్ళు పెట్టుకోవడంతో అమ్మా, నాన్న, చిన్నత్త, నేను యింట్లో మిగిలాం. ఆమెతో ఎక్కువసేపు మెలిగే అవకాశం ఏర్పడింది. చిన్నప్పటి నుంచీ ఆమెతో సాన్నిహిత్యం వున్నప్పటికీ ఆమె సొంత గొడవ యితర్లు ఎవరూ పట్టించుకోనట్టే నేను కూడా పట్టించుకోలేదు. యిప్పుడు ఆమెతో ఎక్కువగా గడపడంతో ఆమె కూడా 'అమ్మడూ' అంటూ ఏవో కబుర్లు చెప్పుకొస్తుంది. ఒకరోజు అమ్మానాన్న వూరెళ్ళినపుడు ఆమె సంగతులు కదిపాను. తన జీవితం గురించి తాను ఆలోచించీ, మాట్లాడీ చాలారోజులయినట్లు గట్టిగా నిట్టూర్చి చెప్పడం మొదలు పెట్టింది.

"నా పెళ్ళి నాటికి నాకు పదేళ్ళుంటాయి కామోసు. మీ మామ నాకన్నా చానా పెద్దోడు. ఆయన ఆళ్ళింటికి పెద్దకొడుకు. నేను మా అప్పచెల్లెళ్ళలో కడుగూటి దాన్నని కాపురం కలిసివస్తాదని నన్ను ఏరికోరి చేసుకున్నారు. పెళ్ళినాటికి నేను సమర్త కాలేదని ఎమ్మటే కాపురానికి తీసుకుబోలేదు. మా యింట్లోనే పెట్టేరు. మా అక్కల పిల్లల్ని, తమ్ముడ్ని ఎత్తుకుంటా రొండు మూడేళ్ళు పుట్టింట్లో హాయిగా కాలం ఎళ్ళబుచ్చేను. తర్వాత సమర్త అవ్వగానే కాపురానికి తీసుకుపోయేరు. ఆయనకి అప్పటికే వుబ్బసం వుండేమో అది ముదిరిపోయింది. నేను కాపురానికెళ్ళిన కొన్ని నెలల్లోనే కాలం చేసేడు. నాకు ఆయన మొకం కూడా సరిగ్గా గుర్తులేదు." అన్నది అత్త ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నట్టు.

నేను వుండబట్టలేక "అత్తా! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోకపోయావా? నీకేం

తక్కువయ్యింది...? యిప్పుడే యింత అందంగా వున్నావు అప్పుడు వయసులో యింకెంత అందంగా వుండేదానివో కదా!" అన్నాను. "నా తల్లా అందం మాట ఏంచెబుతానులే! మీ మామ చచ్చినా బోల్డంత మంది నన్ను పెళ్ళి చేసుకుంటామని మా అమ్మా అయ్యాల్ని అడిగారు. కొంతమంది పెళ్ళికానోళ్ళు కూడా అడిగారు. నేను కూడా ఎవరో ఒకరిని మారు మనువు చేసుకుందామనే అనుకున్నాను. ఏంచేత్తా నొష్ట రాత యిట్టాగుంటే.." అంది పమిటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ. అత్త కళ్ళల్లో నీళ్ళు పుట్టి బుద్దెరిగినాక మేమెవరం చూడలేదు.

రెండు నిముషాలు ఆగినాక అత్త ముక్కు చీదుకుంటూ తనే చెప్పడం మొదలుపెట్టింది. "మా అప్ప చెల్లెళ్ళందరిలో ఒక్కగానొక్క తమ్ముడు మీ నాన్నంటే మాకందరికీ ఎక్కడలేని మమకారం. ఆడేమన్నాడో తెలుసా! నేను గనక మారు మనువు చేసుకుంటే వురేసుకుని ఛస్తాడంట బల్లగుద్దినట్లు చెప్పాడు. అందరం బెంబేలు పడిపోయాం"

> ఆడదానిగా వుండడంలో గౌరవంలేదు గనుక ఆడోళ్ళు తాము మొగోళ్ళలా కనవడాలనీ, అప్పుడే జనం తమని చూసి తగ్గుతారనే అభిప్రాయాన్ని కలిగించింది ఎవురే! ఈ సంగమేకదా! దాన్నోట్ల మన్నుబడ! ఎంత మొండిధైర్యం గా బతికినా అది మనల్ని బతకనిచ్చుద్దా... ఎన్ని రాళ్ళదెబ్బలు తిన్నాను... ఎంతమంది నన్ను దక్కించుకోవాలని చూశారు... అన్నీ బరించుకుని ఆడదానిలా కాక గయ్యాళి దానిలా మిగిలాను.

"బ్రాహ్మలకు మల్లే మనిళ్ళల్లో మారు మనువుకి పెద్దగా ఆటంకం వుండదు. కానీ మన కొంపలోనే మరీ దరిద్రం. గొల్లల్లో కరణం గొల్ల అనేది మిగిలిన గొల్లశాఖలకంటే గొప్పదంటారు. ఈ శాఖలో పురాణాలు, వేదాలు చదివినోళ్ళుంటారు. అందుకని మనం గొల్లోళ్ళలోనే పెద్దోళ్ళం అన్నమాట. అయినాసరే వూళ్ళో రెడ్డోళ్ళు, కమ్మోళ్ళు మనల్ని వొరే... వొసే... అనే పిలుస్తారు. మనం మాత్రం మిగిలిన గొల్లోళ్ళకన్నా, చాకలి, మంగలోళ్ళకన్నా పెద్ద కులమని మురిసిపోతాం. నేను మన చేలల్లో పనిచేసే మాలామాదిగోళ్ళతో కలిసి చేతుల దట్టేవేసి వడ్లబస్తాలు పట్టేదాన్ని. పనీపాటా లేకుండా పంచాయితీలు చేసే మీ నాన్నలాంటోళ్ళకి కులం పట్టింపుగానీ నాకేం పట్టింపు. నిద్ర మొకం లేచిందగ్గర నుంచీ నేను మాలోళ్ళతో కలిసి పనిచెయ్యాల్సిందేకదా! పురాణాలు తెలుసనీ, పుట్టింది కరణం గొల్ల యింట్లోననీ మీ నాయినకకి బ్రామ్మలకున్నంత నీలుగుడు... నీయంతటోడు లేడంటే ఎక్కడలేని మిడిసిపాటు. మళ్ళీ అసలు బ్రాహ్మడు మనోడిని గుమ్మం తొక్కనీయడు. సాగితే ఎవుడయినా సాగించుకుంటాడు. యింకా నయం... బోడి బాపనమ్మలకు మల్లే నాకు కూడా గుండుగీసి మూలన కూర్చోబెట్టలేదు. ఆ... అదికూడా చేసేవాడే... నేను గొడ్డుకుమల్లే యింట్లో పనీ ఈదిలో పనీ చెయ్యాలికదా! అందుకని నన్నిట్టా వదిలేశాడు. ఆడు కాలు మీద కాలేసుకుని రాజకీయం చెబుతుంటే నేను గొడ్డల్లో గొడ్డుగా మొగోళ్ళల్లో మొగోడుగా నా ఆడతనాన్ని మర్చిపోయి చాకిరీ చేశాను. ఈరబాహువు మల్లే కర్ర దీసుకుని రాత్రిపూట పొలంలో కాపలా కెళ్తే నన్ను చూసి కొరివిదెయ్యాలు కూడా పారిపోయేవి. మట్టగోచి పెట్టి లేచానంటే ఎవరైనా నా చేతిలో శవమై తేలుతారని లంజకొడుకులకి దడ... అంత పొగరుగా లేకపోతే ఈ మాయదారి లోకంలో నిబాయించుకోగలిగేదాన్నా... నా సెరిత్ర ఎక్కడో ఆగిపోయేదే... సహజంగా సుకుమారంగా వుండాలనీ, ఆడదానిలా కనిపించాలనీ నాకుమాత్రం అనిపించదా... అమ్మడూ! యిక్కడో తిరకాసుందే! ఆడదానిగా వుండడంలో గౌరవంలేదు గనుక ఆడోళ్ళు తాము మొగోళ్ళలా కనపడాలనీ, అప్పుడే జనం తమని చూసి తగ్గుతారనే అభిప్రాయాన్ని కలిగించింది ఎవురే! ఈ సంగమేకదా! దాన్నోట్ల మన్నుబడ! ఎంత మొండి ధైర్యంగా బతికినా అది మనల్ని బతకనిచ్చుద్దా... ఎన్ని రాళ్ళదెబ్బలు తిన్నాను... ఎంతమంది నన్ను దక్కించుకోవాలని చూశారు... అన్నీ బరించుకుని ఆడదానిలా కాక గయ్యాళి దానిలా మిగిలాను. మా నాయిన మాత్రం తక్కువోడా... ఆడికి నామీద వుండేది గౌరవం కాదు. నా నిజాయితీ అంటే భయం... నన్ను బలవంతంగా ఈ యింటి కట్టుబానిసని చేశాననే అపరాద భావం... సమస్తం మర్చిపోయి ఆడపిల్ల పుట్టింటోళ్ళకి సేవ చేస్తే ఆమెని 'త్యాగమూర్తి' అని చెప్పుకుంటారు. గౌరవం వున్నా లేకపోయినా కనీసం నటిస్తారు. మనం ఏం చేసినా అందులో వాళ్ళ ప్రయోజనాలు, పరువులు అన్నీ మనతో ముడి పెట్టుకుంటారు. చస్తానని బెదిరించీ, ఏడ్చీ మన జీవితం మీద ఆశల్ని మనమే చంపుకునేలా చేసి మన నోటితోనే 'నాకు పెళ్ళీ పెటాకులు వద్దు ' మీరే కావాలి' అనేలా చేస్తారు. మనపై యింతకన్నా పెద్ద కుట్రను ఏ వరాయివాడైనా చెయ్యగలడా చెప్పు... ఆరోజు నాదోవనే జూసు కుని వుంటే వాళ్ళ దృష్టిలో నాకన్నా అపవిత్రురాలు, కులట మరొకటి వుండేదికాదు...అమ్మడూ! నేనెప్పుడూ నీతీ...నీతీ... అని మొత్తుకునేది ఎందుకనుకున్నావు...ఈ నీతిని జనం నాచేత బలవంతంగా తాగించారు. నాయిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా దాన్ని నాకు అంటగట్టా రు... అందుకే నన్నెక్కడ నీతితప్పిందని అనుకుంటారోనని 'మనిషికి నీతి అంటూ వుండాల...' అని నాతో నేనే చెప్పుకుంటూ వుంటాను... అందరినీ వుద్దేశించి పైకి అంటూ వుంటాను. నాకు 'పిల్లాపాపాలేకపోయినా, ఏ ఆనందం లేకపోయినా పుట్టింటి మర్యాద, నా తమ్ముడి ప్రాణం నిలబెట్టాను కాబట్టి నాకు చివరికి మిగిలింది నీతీ, పనీ మాత్రమే... అందుకే ఆ రొండు మాటలు నానోట్లో నానుతుంటాయి..."

అత్త గుండెల్లో మరుగుతున్న అగ్ని అంతా లావాలా పైకి ఎగిసింది. పైకి గడుసుదానిలా, మగరాయుడులా దేన్నీ లెక్కచెయ్యనట్లుండే మా చిన్నత్త కడుపులో యింత దావానలం వుందనీ, ఆమెకీ కన్నీటి రుచి తెలుసనీ అర్థం అయ్యింది. కుటుంబం, సంఘం అనేవి స్త్రీకి ఒక నీతి అనే యినుప చట్రాన్ని తయారుచేసి ఆ చట్రంలో ఎంతో అందంగా, బలవంతంగా యిరికించి ఆమెకేదో కిరీటాన్ని తొడిగినట్టు భ్రమింపచేయడానికి ఆమె చుట్టూ ఎంత పకడ్బందీగా కుట్ర పన్నిందో చిన్నత్త మాటల్లో తెల్సింది. ●

## రుద్రాక్షధారణ- అంతర్జాతీయ ప్రశంసలు

రుద్రాక్షల గురించి చెబుతూ, థామస్ మెక్లీఫే ఓ సందర్భంలో ఇలా అన్నారు. "ఎన్నో వేల సంవత్సరాల క్రితం ఋషులతో నమోదు చేయబడ్డ ఈ జ్ఞాన నిధిని సద్వినియోగం చేసుకోలేకపోయిన భారత జాతి ప్రజలు ఎంతో దురదృష్టవంతులు".

బ్రిటిష్ జాతీయుడైన థామస్ మెక్లీఫె భారతదేశంలో సర్వేయర్ జనరల్ కార్యాలయంలో కొంతకాలం పనిచేశాడు. హిమాలయ పర్వత ప్రాంతంలోని కొన్ని భాగాలను సర్వే చేస్తుండగా, ఆయన తొలిసారిగా రుద్రాక్ష మాలలు ధరించిన కొందరు కొండజాతి ప్రజలు దృఢంగా, ఆరోగ్యవంతులుగా ఉండటం గమనించాడు.

ఆ గ్రామ పరిసరాల్లో మెక్లీఫెకు హఠాత్తుగా రక్తపోటు ఎక్కువై స్పృహ తప్పితే, అక్కడి నాటు వైద్యులు వైద్యం చేసి, అతని మెడలో 57 రుద్రాక్ష మాల వేశారు. మెక్లీఫె తన అనుభవాలను వివరిస్తూ ఉత్తరాలు రాశాడు. 1946లో ప్రచురితమైన ఈ ఉత్తరాలను ఆస్ట్రేలియాకు చెందిన అలాన్ సమ్మర్స్ పరిశోధించాడు. ఈ పరిశోధనలో సమ్మర్స్ రుద్రాక్షల గురించి యిలా చెప్పాడు.

"తలచుట్టూ కాని, మెడలోకాని రుద్రాక్షమాల ధరిస్తే ధారకుని శరీరంపై అది చిత్రమైన ప్రభావం చూపెడుతున్నట్లు కనిపిస్తుంది. రక్తపోటు సాధారణస్థితికి వస్తుంది. శిరోవేదన, శరీరంలో నెప్పులు మాయమౌతాయి."

సమ్మర్స్ పరిశోధనలో మరో రెండు విషయాలను చెప్పాడు.

1. మూర్ఛ రోగులలో చెప్పుకోతగిన శాతంలో వాళ్ళ సాధారణ ఆరోగ్య స్థితి మెరుగుపడింది.

2. హిమాలయ ప్రాంతపు రుద్రాక్షలలో అత్యుత్తమ స్వస్థతా గుణాలున్నాయి.

సింహళ దేశానికి చెందిన దంత వైద్యుడు డాక్టర్ మాధవ మనోహరన్ దంత రక్షణ గురించి రాసిన పుస్తకంలో ప్రతిరోజు నాలుగేసి పండిన రుద్రాక్ష పళ్ళను పది రోజులు చప్పరిస్తే, పయోరియా వ్యాధి నమ్మశక్యం కాని రీతిలో మాయమౌతుందని రాశారు.

జపాన్‌కు చెందిన సుజికి కార్పొరేషన్ అంతర్జాతీయ మార్కెటింగ్ విభాగంలో ఉన్నతస్థానంలో ఉన్న హీరాకి అనే ఆయన దైనందిన వత్తిళ్ళను తట్టుకొనే శక్తి రుద్రాక్ష ధారణవల్ల లభిస్తుంది" అన్నాడు.

ఖాట్మండ్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాచురల్ ఎడిసన్ అధిపతి డాక్టర్ బిస్తా అపర రుద్రాక్షల ప్రేమికుడు, ఆయన ఏకంగా కొన్నివేల రుద్రాక్షలతో చిన్న రుద్రాక్ష కుటీరాన్ని నిర్మించి రోజుకు కొన్ని గంటలైనా అందులో గడిపే ఏర్పాటు చేసుకున్నారు.

**- డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి**

చదవండి **మీ విజ్ఞాన తృష్ణకి సరైన వేదిక** చదివించండి

**మహర్షి కాలజ్ఞానమ్**
**వేదజ్యోతిష విజ్ఞాన మాసపత్రిక**
డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి సంపాదకత్వంలో
వేదము Vs సైన్సు - సమన్వయ వేదిక

**సం॥ర చందాదారులుకండి**
**ఉచితజాతకం, రుద్రాక్ష పొందండి**
**సభ్యులను చేర్పించుటకు ఏజంట్సును ఆహ్వానిస్తున్నాము.**

శ్రీమహర్షి పబ్లికేషన్స్

**శ్రీ మహర్షి రుద్రాక్ష & నవరత్న ఎంపోరియం**
నం.13, గాయత్రి టవర్స్, Opp: ఓల్డ్‌బస్‌స్టాండు ఎదురుగా, విజయవాడ - 0866-570199
బ్రాంచి : 6-3-354/10, హిందీనగర్, పంజాగుట్ట - హైదరాబాద్ 040-6636696